# ఆర్మీ జవాన్ కుటుంబ సభ్యులకు స్పీకర్ భరోసా

- రూ. 50 వేల ఆర్థిక సాయం అందజేత
- ఇటీవల సిక్కిం వరదలో గల్లంతై మృతిచెందిన సాలూరా వాసి గంగప్రసాద్



బాధిత కుటుంబ సభ్యులకు రూ. 50 వేల ఆర్థిక సాయం అందజేస్తున్న స్పీకర్ పోచారం

బాన్సువాడ, అక్టోబర్ 19: ఇటీవల సిక్కిం వరదల్లో నిజామాబాద్ జిల్లా సాలూరా మండలం కుమ్మన్‌పల్లి గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ నీరడి గంగ ప్రసాద్ గల్లంతై మృతిచెందగా.. బాధిత కుటుంబానికి సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి అండగా నిలిచారు. గంగప్రసాద్ కుటుంబ సభ్యులు గురువారం బాన్సువాడలో స్పీకర్‌ను కలిశారు. ఈ సందర్భంగా స్పీకర్ నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో ఫోన్‌లో మాట్లాడి.. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని సూచించారు. ఆర్మీ జవాన్ సతీమణికి ప్రభుత్వ ఉద్యోగం, రూ. 5 లక్షల ఆర్థిక సాయం, ఇంటి స్థలం ఇస్తామని కలెక్టర్ చెప్పారని సభాపతి తెలిపారు. ఆర్మీ జవాన్ గంగ ప్రసాద్ తండ్రి మానసిక స్థితి సరిగాలేదని, ఆయన చిన్న కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చేలా చూస్తామన్నారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు స్పీకర్ రూ. 50వేల ఆర్థిక సాయం అందజేశారు. రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు రూ.25 వేలు అందజేశారు. కార్యక్రమంలో విండో అధ్యక్షుడు ఏర్వాల కృష్ణారెడ్డి, కుమ్మన్ పల్లి గ్రామ సర్పంచ్ కొర్వ గంగాధర్, ఎంపీటీసీ గంగన్ ప్రభాకర్ , మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ దొడ్ల కాశీరెడ్డి, మహేందర్‌రెడ్డి, ఆవుల సంజీవ్, కొర్వ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# మేమంతా సభాపతి పోచారం వెంటే..

- దేశాయిపేట గ్రామ బోయ సంఘం, ముదిరాజ్, బాన్సువాడ రైస్‌మిల్లర్స్ ఏకగ్రీవ తీర్మానం
- స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డికి తీర్మాన కాపీల అందజేత



స్పీకర్‌కు ఏకగ్రీవ తీర్మాన కాపీని అందజేస్తున్న బాన్సువాడ డివిజన్ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు

బాన్సువాడ, అక్టోబర్ 19: బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాసరెడ్డికి మద్దతుగా కుల సంఘాల ఏకగ్రీవ తీర్మానాలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా బాన్సువాడ మండలంలోని దేశాయిపేట్ గ్రామానికి చెందిన బోయ సంఘం (120 సభ్యులు), ముదిరాజ్ సంఘం (50 మంది సభ్యులు) తోపాటుబాన్సువాడ డివిజన్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డికి మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ మేరకు ఏకగ్రీవ తీర్మాన కాపీని బాన్సువాడలో స్పీకర్‌ను కలిసి గురువారం అందజేశారు. బాన్సువాడ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్‌కు కుల సంఘాలు సభ్యులు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. బాన్సువాడలోని శ్రీ జ్ఞాన సరస్వతీ ఆలయంలో శ్రీ లక్ష్మీమాత అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారిని సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి దంపతులు గురువారం దర్శించుకున్నారు.

# హన్మంత్ షిండేకు రైస్‌మిల్లర్స్ మద్దతు



హన్మంత్‌షిండేకు మద్దతు ప్రకటిస్తూ తీర్మాన పత్రాన్ని అందజేస్తున్న బాన్సువాడ డివిజన్ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు

నిజాంసాగర్, అక్టోబర్19: అసెంబ్లీ ఎన్నికల్లో తామంతా బీఆర్‌ఎస్ పార్టీకి మద్దతు పలుకుతామని, ఎమ్మెల్యేగా హన్మంత్‌షిండేను మరో మారు గెలిపించుకుంటామని బాన్సువాడ డివిజన్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు స్పష్టం చేశారు. గురువారం బాన్సువాడ డివిజన్ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు.. ఎమ్మెల్యే హన్మంత్ షిండేను బిచ్కుందలోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా వారు హన్మంత్‌షిండేకు మద్దతు ప్రకటిస్తున్నట్లు తీర్మానకాపీని అందజేశారు. భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఉడుగుల లక్ష్మణ్, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఏర్వాల కృష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# వేములకు వెల్లువెత్తుతున్న మద్దతు



ఎంపీపీ, సర్పంచ్‌కు తీర్మాన కాపీని అందజేస్తున్న మోర్తాడ్ మండల మేరు సంఘ సభ్యులు

మోర్తాడ్, అక్టోబర్19: బాల్కొండ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి వేముల ప్రశాంత్‌రెడ్డికి మోర్తాడ్ మండలంలో మద్దతు వెల్లువెత్తుతున్నది. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న మేరుసంఘం సభ్యులు (62 కుటుంబాలు) రానున్న ఎన్నికల్లో వేముల ప్రశాంత్‌రెడ్డికే తమ మద్దతు ప్రకటిస్తూ గురువారం ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. ఈ మేరకు తీర్మాన కాపీలను ఎంపీపీ శివలింగు శ్రీనివాస్, సర్పంచ్ ధరణికి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాజ్‌పాల్, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# యాదవుల అభ్యున్నతికి ప్రభుత్వ కృషి

- సబ్సిడీపై గొర్రెల పంపిణీతో ఉపాధికి ఊతం
- పారదర్శకంగా గొర్రెల పంపిణీ
- సేఫ్ సిటీగా నిజామాబాద్
- యాదవ ఆత్మీయ సమ్మేళనంలో అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా



మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా



హాజరైన యాదవ కుటుంబాలు

ఖలీల్‌వాడి, అక్టోబర్ 19: గొల్ల కుర్మలు ఆర్థికంగా వృద్ధి చెందాలనే ఉద్దేశంతో సబ్సిడీపై గొర్రెల పంపిణీ కార్యక్రమానికి సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టినట్లు అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా అన్నారు. నగరంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న మున్నూరుకాపు సంఘంలో గురువారం యాదవ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిగాల హాజరై మాట్లాడారు. యాదవుల ఆత్మ గౌరవానికి ప్రతీకగా రూ.25 లక్షలతో యాదవ భవనం నిర్మిస్తున్నామని తెలిపారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే అన్ని కులాలు, మతాల వారు సంతోషంగా ఉన్నారని అన్నారు. నగరంలోని ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. మిషన్ భగీరథతో ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తున్నట్లు చెప్పారు. చివరి మజిలీ గౌరవంగా జరిగేందుకు ఆధునిక సదుపాయాలతో వైకుంఠధామాలు నిర్మించినట్లు తెలిపారు. సంక్షేమంలో భాగంగా ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ మరోసారి అధికారంలోకి వచ్చాక విడుతల వారీగా ఆసరా పింఛన్లు రూ.5వేలకు పెంచుతామన్నారు. సంక్షేమం, అభివృద్ధి చూసి మరోసారి బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూకిరణ్, కార్పొరేటర్లు మల్లేశ్‌యాదవ్, ఆకుల హేమలత, మహిళా నాయకులు మేక లక్ష్మీ యాదవ్, మంజులా యాదవ్, నాని యాదవ్, యాదవ సంఘం నాయకులు గుర్రం మల్లేశ్ యాదవ్, కుంబాల యాదగిరి యాదవ్, రఘు యాదవ్, దేవేందర్ యాదవ్ పాల్గొన్నారు.

